
సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 27 । అక్టోబర్ । 2023



అభ్యసనా సామర్థ్యాల పెంపు
విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పెంపుపై విద్యాశాఖ దృష్టి సారించింది. ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించింది.
8లో ▸



ఆశాజనకంగా ఖరీఫ్
వర్షాభావ పరిస్థితుల్లోనూ జిల్లాలో సార్వా వరి పైరు ఆశాజనకంగా ఉందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.
8లో ▸



చోరీ సొత్తు స్వాధీనం
రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని పట్టుకుని రూ.5 లక్షల విలువైన వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
8లో ▸

న్యూస్‌రీల్

ఆయుధాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ సుబ్బరాజు

సాక్షి, భీమవరం: పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా భీమవరం సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీస్ హెడ్ క్వార్టర్స్‌లో గురువారం విద్యార్థులతో ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సుబ్బరాజు ఆయుధాల పనితీరు, పోలీసు శాఖపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విపత్తుల సమయాల్లో పోలీసులు వ్యవహరించే తీరును వివరించారు. టియర్ గ్యాస్, డ్రోన్లు, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాల ప్రదర్శనను విద్యార్థులు వీక్షించారు. శనివారం భీమవరంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తామని ఆయన చెప్పారు. పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పాలకొల్లు కమిషనర్ బదిలీ

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు మున్సిపల్ కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రి సీడీఎంఏకు రిపోర్టు చేయాలని గురువారం రాత్రి ఉత్తర్వులు వచ్చినట్టు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ డి.చంద్రశేఖర్‌ను ఎఫ్ఏసీ (ఫుల్ అడిషనల్ చార్జ్)గా నియమించినట్టు తెలిపారు. గతంలో మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కోవిడ్ అవకతవకలపై సరైన చర్యలు తీసుకోకపోవడంతో ప్రస్తుత కమిషనర్ శేషాద్రిని రిపోర్టు చేయాలని ఉత్తర్వులు వచ్చినట్టు సమాచారం.

హోమ్‌గార్డుల సంక్షేమానికి ప్రాధాన్యం

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తున్న సిబ్బందితోపాటు హోమ్‌గార్డుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నామని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో భీమవరం హోంగార్డు యూనిట్‌లో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఏవీవీ సత్యనారాయణకు రూ.5,44,570 చెక్కును గురువారం ఆమె అందజేశారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబంతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఏఆర్ ఆర్ఐ పవన్‌కుమార్ ఉన్నారు.

జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకానికి దరఖాస్తులు

ఏలూరు(మెట్రో): రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్యాపరంగా బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాల అభ్యర్థుల కోసం ప్రభుత్వం 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం' అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టిందని సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ జయప్రకాష్ తెలిపారు. యూపీఎస్సీ నిర్వహించే ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన వారి కోసం నగదు ప్రోత్సాహకంగా ఆర్థిక సహాయం అందిస్తారని పేర్కొన్నారు. ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి రూ.లక్ష, మెయిన్స్‌లో అర్హత సాధించిన వారికి రూ.50 వేల ప్రోత్సాహకం అందిస్తారని, ఈ మేరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. అభ్యర్థులు jnanabhumi.ap.gov.in పోర్టల్‌లో అందించిన వెబ్‌లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో వచ్చేనెల 4లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సామాజిక సాధికార భేరి

- నేడు నరసాపురంలో వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర
- అట్టడుగు వర్గాలకు చేకూరిన మేలు, సంక్షేమాభివృద్ధిని వివరించనున్న నేతలు
- 20 గ్రామాల మీదుగా 25 కిలోమీటర్ల మేర యాత్ర
- సాయంత్రం భారీ బహిరంగ సభ



నరసాపురంలో వైఎస్సార్‌సీపీ జెండాలతో అలంకరించిన దృశ్యం



యాత్ర జరిగే దారిపొడవునా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

నరసాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర శుక్రవారం నరసాపురం నియోజకవర్గంలో ప్రారంభం కానుంది. గోదావరి జిల్లాలకు సంబంధించి తీర ప్రాంతం నరసాపురం నుంచి బస్సు యాత్ర ఆరంభం కానుంది. రాబోయే ఎన్నికల సమాయత్తంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన బస్సు యాత్రను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సమాయత్తమయ్యాయి. ఈ మేరకు నరసాపురం నియోజకవర్గంలో యాత్రకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. బస్సు యాత్ర సాగే దారి పొడవునా ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. వైఎస్సార్‌సీపీ జెండాలతో దారి పొడవునా అలంకరించారు.

25 కిలోమీటర్ల మేర.. మొగల్తూరు ఉంచి నరసాపురం పట్టణం వరకు సుమారు 20 గ్రామాల మీదుగా 25 కిలోమీటర్ల మేర బస్సు యాత్ర సాగనుంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో ఓ వైపు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తూనే మరో వైపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి బృహత్తర కార్యక్రమాలను చేపట్టింది. వీటన్నింటినీ ప్రజలకు వివరించేలా బస్సు యాత్ర చేపట్టినట్టు ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రముఖుల హాజరు : శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, పిల్లి సుభాష్‌చంద్రబోస్, మంత్రులు తానేటి వనిత, కొట్టు సత్యనారాయణ, సీదిరి అప్పలరాజు, పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఉభయగోదావరి జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు. బహిరంగ సభా వేదికగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చట్టసభలు, నామినేటెడ్ పోస్టుల్లో దక్కిన గౌరవం, ఆయా వర్గాలు రాజకీయంగా, ఆర్థికంగా బలపడేందుకు తీసుకున్న నిర్ణయాలు, చర్యలను ప్రజలకు వివరించనున్నారు.

బస్సు యాత్ర షెడ్యూల్

- మొగల్తూరు సెంటర్‌లో మధ్యాహ్నం 3 గంటలకు బస్సు యాత్ర ప్రారంభమవుతుంది.
- మొగల్తూరు నుంచి రామన్నపాలెం, ఎల్‌బీ చర్ల మీదుగా యాత్ర నరసాపురం పట్టణం చేరుకుంటుంది.
- సాయంత్రం 6 గంటలకు నరసాపురంలోని ప్రకాశం రోడ్డు రామాలయం సెంటర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తారు.

భీమవరంలో అంతర్జాతీయ చెస్ టోర్నీ



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: భీమవరంలోని యూత్ కల్చరల్ అసోసియేషన్‌లో ఇంటర్నేషనల్ ఫెడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. గురువారం టోర్నీ బ్రోచర్లు ఆవిష్కరించారు. అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో యూత్ కల్చరల్ అసోసియేషన్, పశ్చిమగోదావరి జిల్లా చెస్ అసోసియేషన్ల సహకారంతో పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఈ పోటీల్లో పాల్గొని అంతర్జాతీయ రేటింగ్ సాధించుకోవచ్చన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ సుమారు 300 మంది క్రీడాకారులు హాజరుకానున్నారని, రూ.5 లక్షల బహుమతులు అందిస్తామని చెప్పారు. మంతెన సీతారామరాజు, క్లబ్ ఉపాధ్యక్షుడు పేరిచర్ల శ్రీనివాసరాజు, కార్యదర్శి కూసంపూడి సత్యనారాయణరాజు, కోశాధికారి కూనప రాజు సత్యనారాయణ రాజు, సంయుక్త కార్యదర్శి వేగేశ్న రామకృష్ణంరాజు పాల్గొన్నారు. వివరాలకు సెల్ 90632 24466లో సంప్రదించాలని కోరారు.

ఆరోగ్య సురక్షలో స్పెషలిస్టు వైద్యం

కలెక్టర్ ప్రశాంతి



వీరవాసరంలో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

వీరవాసరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబానికీ వైద్య సేవలు అందిస్తున్నామని, ముఖ్యంగా పేదలకు స్పెషలిస్టు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం వీరవాసరం పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఆమె పరిశీలించారు. శిబిరం వద్ద కౌంటర్లు, ఆరోగ్య పరీక్షలు, మందుల పంపిణీ, వైద్య సేవలను పరిశీలించి రోగులతో మాట్లాడారు. వారి ఇబ్బందులు తెలుసుకుని, శిబిరాల ఉపయోగాన్ని వివరించారు. ఆరోగ్యశ్రీలో ఎన్నిరకాల వైద్య సేవలు పొందవచ్చనే విషయాలను అందరికీ తెలియజేయాలని ఆరోగ్య మిత్రలకు సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఆరోగ్య సురక్ష శిబిరాలు విజయవంతంగా జరుగుతున్నాయని, మరింత మంది వైద్య సేవలు పొందేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ఇప్పటికే ప్రజల వద్దకు వైద్యాన్ని చేర్చగా.. ఆరోగ్య సురక్ష ద్వారా స్పెషలిస్టుల సేవలను సైతం అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. ఇద్దరు పీహెచ్‌సీ వైద్యులతో పాటు మరో ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు ఆరోగ్య సురక్ష శిబిరాల్లో సేవలందిస్తారన్నారు. క్యాంపుల్లో ఈసీజీతో సహా 14 రకాల పరీక్షలను నిర్వహించి, 105 రకాల మందులను ఉచితంగా అందిస్తున్నారన్నారు. కంటి పరీక్షలు కూడా నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు కూడా అందజేస్తున్నామని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. ఆర్డీఓ కె.శ్రీనివాసులురాజు, అదనపు డీఎంహెచ్ఓ బి.భానునాయక్, సర్పంచ్ చికిలే మంగతాయారు, బోను జ్యోష్ణదేవి, ఐసీడీఎస్ బి.సుజాతా రాణి, తహసీల్దార్ ఎం.సుందర రాజు, ఎంపీడీఓ కె.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డోర్ డెలివరీ మాసోత్సవాలు



పార్సిల్‌ను అందిస్తున్న ఆర్ఎం వీరయ్య చౌదరి

భీమవరం (ప్రకాశంచౌక్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, కార్గో పార్సిల్ కొరియర్ రవాణా విభాగం ఆధ్వర్యంలో వచ్చేనెల 25 వరకు డోర్ డెలివరీ మాసోత్సవాలను నిర్వహిస్తున్నామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎ.వీరయ్య చౌదరి తెలిపారు. భీమవరం ఆర్టీసీ బస్టాండ్‌లో మాసోత్సవాలను గురువారం ఆయన ప్రారంభించారు. 50 కిలో బరువు గల పార్సిల్‌ను ఇంటి వద్దకే చేరుస్తామని, 10 కిలోమీటర్ల పరిధిలో ఈ సేవలు అందిస్తామన్నారు. గతేడాది జిల్లాలోని నాలుగు డిపోల్లో 6,500 డోర్ డెలివరీ సేవలు అందించామని, ఈ ఏడాది మరిన్ని ఎక్కువ సేవలు అందిస్తామన్నారు. డిపో మేనేజర్ పీఎస్‌వీఎం సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ మేనేజర్ వై.సురేష్ పాల్గొన్నారు.

కొనుగోళ్లకు ప్రాధాన్యం

రైతు సంక్షేమమే లక్ష్యం

- సార్వా ధాన్యం సేకరణకు చర్యలు
- 708 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- 9.95 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం
- మద్దతు ధరల పెంపు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: రాష్ట్రంలో అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. విత్తు నుంచి పంట చేతికి వచ్చేవరకూ అన్నివిధాలా అండగా నిలుస్తోంది. దీనిలో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా సార్వా ధాన్యం కొనుగోలుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలను గుర్తించి సిబ్బంది నియామకం పూర్తి చేశారు. ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వ్యవసాయ, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులు సంయుక్తంగా ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సాంకేతిక సిబ్బంది నియామకం

ఏలూరు జిల్లాలో 394, పశ్చిమగోదావరి జిల్లాలో 314 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి ఆయా కేంద్రాల్లో టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హెల్పర్ల నియామకం పూర్తిచేశారు. ఏలూరు జిల్లాలో 5.30 లక్షల టన్నులు, పశ్చిమగోదావరి జిల్లాలో 4.65 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా వేసి ఆ మేరకు సేకరించనున్నారు. రెండు జిల్లాల్లో ధాన్యం సేకరణకు సుమారు 3 కోట్ల గోనె సంచులు అవసరమవుతాయని గుర్తించారు. గతంలో ఎదురయ్యే ఇబ్బందులు తలెత్తకుండా కళ్లాల్లోనే ధాన్యం కొనుగోలుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

నేరుగా రైతుల ఖాతాల్లోకి సొమ్ములు

గతంలో క్వింటాల్ ఏ–గ్రేడ్ ధాన్యం మద్దతు ధర రూ.2,060 ఉండగా ప్రస్తుతం దానిని రూ.2,203కు, కామన్ రకానికి రూ.2,040 చెల్లించగా ప్రస్తుతం రూ.2,183 ధర చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రైతు నేరుగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించి, విక్రయించుకుంటే హమాలీ, రవాణా చార్జీలు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు చెల్లించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. అలాగే ధాన్యం సొమ్ములు సైతం రైతు ఖాతాల్లో నిర్దేశిత సమయంలోపు నేరుగా చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రారంభం నుంచి చివరి వరకు ధాన్యం ఉత్పత్తి అయ్యే గ్రామాలను ముందుగానే గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ముందస్తు కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు	
పశ్చిమగోదావరి జిల్లా	314
ఏలూరు జిల్లా	394
ధాన్యం సేకరణ లక్ష్యం	
పశ్చిమగోదావరి జిల్లా	4.65 లక్షల టన్నులు
ఏలూరు జిల్లా	5.30 లక్షల టన్నులు
గోనె సంచుల అవసరం	3 కోట్లు

ధాన్యం మద్దతు ధరలు (క్వింటాల్‌కు..)

రకం	గతం (రూ.)	ప్రస్తుతం (రూ.)
ఏ–గ్రేడ్	2,060	2,203
సాధారణ	2,040	2,183

సర్వం సిద్ధం



జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. రైతుభరోసా కేంద్రాల్లో ఇప్పటికే తాత్కాలిక సిబ్బందిని నియమించి రైతులకు విక్రయ సమయాల్లో ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం గతం కంటే ప్రస్తుతం మద్దతు ధర పెంచింది. అలాగే ధాన్యం విక్రయించిన రైతులకు నిర్దేశిత సమయంలోపు పంట సొమ్ములు వారి ఖాతాల్లో జమ చేస్తాం.
– బి.లావణ్యవేణి, జాయింట్ కలెక్టర్, ఏలూరు

కమనీయం.. కడు రమణీయం

- అట్టహాసంగా చిన వెంకన్న తిరు కల్యాణోత్సవం
- వైభవంగా ఎదుర్కోలు ఉత్సవం
- నేటి రాత్రి రథోత్సవం



వేదికపై శ్రీవారు, అమ్మవార్ల కల్యాణమూర్తులు



కల్యాణ వైభోగమే.. ద్వారకాతిరుమల క్షేత్రంలో కల్యాణ తంతు జరిపిస్తున్న పండితులు



పట్టువస్త్రాలను తీసుకువస్తున్న హోం మంత్రి వనిత, ఎమ్మెల్యే తలారి, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ



శ్రీవారికి పట్టువస్త్రాలను తీసుకువస్తున్న అనువంశిక ధర్మకర్త నివృతరావు, టీటీడీ ట్రస్టు బోర్డు సభ్యులు

ద్వారకాతిరుమల: సర్వ జగద్రక్షకుడైన శ్రీవారు సర్వాభరణ భూషితుడై నుదుటున కల్యాణ తిలకం, బుగ్గన చుక్కతో సిగ్గులొలుకుతున్న ఉభయ దేవేరులను పెండ్లాడారు. ఈ అద్భుత ఘట్టం ద్వారకాతిరుమల క్షేత్రంలో గురువారం రాత్రి ఆవిష్కృతమైంది. శ్రీవారి ఆశ్వీయుజ మాస దివ్య బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన తిరుకల్యాణ మహోత్సవం ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలో అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్లను ఆలయం నుంచి రెండు వేర్వేరు వాహనాలపై మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థుల వేద మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. శోభాయమానంగా అలంకరించిన వేదికపై ఉన్న రజత సింహాసనంపై కల్యాణమూర్తులను ఉంచి వేడుకను ప్రారంభించారు. వివిధ ఘట్టాలను పూర్తి చేసిన తర్వాత శుభముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేసి, మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకను భక్తుల గోవింద నామస్మరణల నడుమ నిర్వహించారు.

పట్టువస్త్రాల సమర్పణ

దేవస్థానం తరఫున ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఆయన కుమారుడు ఎస్వీ నివృతరావులు శ్రీవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున హోం మంత్రి తానేటి వనిత, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీలు అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. శ్రీహరి కళాతోరణ వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వాహన సేవలు : స్వామివారు ఉదయం సూర్యప్రభ, కల్యాణ వేడుక అనంతరం రాత్రి వెండి గరుడ వాహనాలపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. అలాగే ఎదుర్కోలు ఉత్సవాన్ని నిత్య కల్యాణ మండపంలో ఉదయం అర్చకులు అట్టహాసంగా నిర్వహించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు పర్యవేక్షించారు. టీటీడీ ట్రస్టు బోర్డు సభ్యులు మేకా శేషుబాబు, గాదిరాజు సుబ్బరాజు, చిన వెంకన్న ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మోహినీ అలంకారంలో శ్రీవారు : ఆలయ ముఖమండపంలో శ్రీవారు మోహినీ అలంకారంలో దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి 7 గంటల నుంచి రథోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 8.30 నుంచి రాత్రి 9 గంటల వరకు వేద పారాయణలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. రుక్మిణీ సత్యభామ సమేత మురళీకృష్ణ అలంకారంలో శ్రీవారు దర్శనమిస్తారు.

ఫోర్టిఫైడ్ బియ్యంతో సంపూర్ణ ఆరోగ్యం

- ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- ప్రజలందరికీ బలవర్ధక బియ్యం
- 5.66 లక్షల కార్డుదారులకు పంపిణీ



పాలకోడేరులో రేషన్ బియ్యం పంపిణీ (ఫైల్)

సాక్షి, భీమవరం: ప్రజల్లో పోషకాహార లోపాలను నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా ప్రజల ఆరోగ్య సమస్యలకు ఫోర్టిఫైడ్ రైస్ (బలవర్ధక బియ్యం)తో చెక్ పెట్టాలని భావించింది. ఈ మేరకు ప్రతినెలా ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరాకు చర్యలు తీసుకుంది. అయితే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మేలు చేసే ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన లేకపోవడంతో ప్రజలు వినియోగించేందుకు ఆలోచిస్తున్నారు. బలవర్ధక బియ్యం పంపిణీ చేపట్టి నెలలు గడుస్తున్నా కొందరు ప్లాస్టిక్ రైస్‌గా, మరికొందరు కల్తీలు జరుగుతున్నట్టు అపోహ పడుతున్నారు. దీంతో బియ్యాన్ని వాడకుండా బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఫోర్టిఫైడ్ బి య్యం ప్రయోజనాలపై అధికారులు అవగాహన కలిగిస్తున్నారు.

నెలకు 8,590 లక్షల టన్నులు

జిల్లాలోని 20 మండలాల్లో 5,66,021 రేషన్ కార్డుల ద్వారా నెలకు 8,590 టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. ఫోర్టిఫైడ్ బియ్యాన్ని వినియోగించడం ద్వారా శరీరానికి సూక్ష్మపోషకాలు అందుతాయి. ప్రధానంగా పౌష్టికాహార లోపం ఉన్న మహిళలు, చిన్నారులకు ఈ బియ్యం ఎంతో ఉపయోగం. ఫోలిక్ యాసిడ్, ఐరన్, విటమిన్ బి–12తో చేసిన పిండితో ఫోర్టిఫైడ్ బియ్యం కెర్నెల్స్ తయారు చేస్తారు. వీటిని రేషన్‌షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యంలో కలుపుతారు. ప్రభుత్వం పంపిణీ చేసే బియ్యానికి అదనంగా విటమిన్లు, ఖనిజాలను జోడించడాన్ని రైస్ ఫోర్టిఫికేషన్ అంటారు. ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి–12 వంటి కీలక సూక్ష్మపోషకాలను బియ్యంలో చేర్చడం ద్వారా పౌష్టికాహార లోపాన్ని అరికట్టే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. విటమిన్ బి–12 మెదడు, నాడీ వ్యవస్థ అభివృద్ధికి, ఎర్ర రక్తకణాల ఉత్పత్తిలో కీలకంగా పనిచేస్తుంది. రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిని సరైన మోతాదులో ఉంచుతూ రక్తహీనతను అరికట్టడంలో ఐరన్ అత్యంత ప్రాధాన్యమిస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యం 100 గ్రాముల్లో 98 మైక్రోగ్రామ్స్ ఫోలిక్ యాసిడ్, ఐరన్ 40 మిల్లీ గ్రాములు ఉంటుంది. ఇక విటమిన్ బి–12 సమృద్ధిగా లభిస్తుంది.

ప్లాస్టిక్ బియ్యమంటూ అపోహలు

ప్రభుత్వం పంపిణీ చేసే ఫోర్టిఫైడ్ బియ్యాన్ని కొందరు అవగాహన లోపంతో ప్లాస్టిక్ బియ్యం అంటూ ప్రచారం చేస్తున్నారు. 100 కిలోల రేషన్ బియ్యంలో కిలో నుంచి రెండు కిలోల ఫోర్టిఫైడ్ బియ్యాన్ని కలుపుతారు. అయితే ఫోర్టిఫైడ్ కెర్నెల్స్ తేలికగా ఉండటంతో బియ్యాన్ని నీటిలో వేసినపుడుపైకి తేలుతుంటాయి. దీంతో వాటిని ప్లాస్టిక్ బియ్యంగా అపోహలు పడుతున్నారు.

క్లుప్తంగా

108లో సుఖప్రసవం



తణుకు ఆసుపత్రికి వెళ్తుండగా 108లో ప్రసవించిన మహిళ

పెనుగొండ: 108లో గర్భిణి ప్రసవించిన సంఘటన ఆచంట మండలం వల్లూరులో జరిగింది. వల్లూరు పీహెచ్‌సీ నుంచి అనూష(30)ను తణుకు ప్రభుత్వాసుపత్రికి గురువారం తెల్లవారుజామున తీసుకు వెళ్తుండగా మధ్యలోనే ఆడ పిల్లకు జన్మనిచ్చింది. 108 సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవడంతో తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా సాధారణ ప్రసవం జరిగింది. తల్లీబిడ్డను తణుకు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించినట్లు 108 సిబ్బంది తెలిపారు. ఈఎంటీ సురేష్, పైలట్ సీహెచ్ రాంబాబుకు అనూష కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ఆగిరిపల్లి: కొడుకు చనిపోయాడన్న దిగులుతో తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆగిరిపల్లి ఎస్సై నంబూరు చంటిబాబు తెలిపిన వివరాల ప్రకారం కొమ్మూరు గ్రామనికి చెందిన టీ ఆనందరాజు, భూలక్ష్మికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు. నెల రోజుల క్రితం పెద్దకుమాడు భాను ప్రసాద్ చనిపోవడంతో అప్పటి నుంచి తండ్రి ఆనందరాజు దిగులుగా ఉంటున్నాడు. కొడుకు చనిపోయాడనే మనస్తాపంతో ఈనెల 18న ఎలుకల మందు తిన్నాడు. వెంటనే భార్య హనుమాన్ జంక్షన్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లింది. అక్కడ రెండు రోజులు చికిత్స అందించిన తరువాత పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ఈనెల 21న విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాల పెంపు

1, 2 తరగతుల కోసం ఎఫ్‌ఎల్‌ఎన్ విధానం



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి శ్యామ్ సుందర్ (ఫైల్)

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : జాతీయ విద్యావిధానంలో అమలు చేస్తున్న అంశాలను విద్యార్థులు అందుకునేందుకు విద్యాశాఖ పూర్తి స్థాయిలో దృష్టి పెట్టింది. ప్రాథమిక స్థాయిలో అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపర్చే ఆలోచనతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో విద్యార్థి అభ్యసనా సామర్థ్యాల పెంపు ప్రత్యేక లక్ష్యంగా ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ(ఎఫ్‌ఎల్‌ఎన్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్(సాల్ట్)లో భాగంగా ప్రథమ్ అనే ప్రభుత్వేతర సంస్థ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం నిర్వహించడానికి పూనుకుంది.

విద్యా సంస్కరణలు అందుకునేలా..

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన విద్యావిధానం – 2020లో భాగంగా ప్రభుత్వం పలు విద్యా సంస్కరణలు ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. నిపుణ్ భారత్ లక్ష్యాలను సాధించే క్రమంలో ఎర్లీ చైల్డ్ సెంటర్ ఎడ్యుకేషన్‌ను అమలుచేస్తున్నారు. ఇందులో ప్రీ ప్రైమరీ-1, ప్రీ ప్రైమరీ-2గా విభజించి అమలు చేయడానికి నిర్ణయించారు. ప్రీ ప్రైమరీ-1లో 3, 4 ఏళ్ళ వయసు కలిగిన చిన్నారులకు, ప్రీ ప్రైమరీ-2లో 5, 6 ఏళ్ళ చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యా బోధన చేస్తారు. ప్రీ ప్రైమరీలోనే పాఠశాల సంసిద్ధతా కార్యక్రమాలు అమలు చేస్తారు. ఐదేళ్లు నిండిన చిన్నారులకు ప్రైమరీ తరగతులు నిర్వహిస్తారు. ప్రీ ప్రైమరీ, ప్రైమరీలో 1, 2 తరగతులకు ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా 2026-27 విద్యా సంవత్సరానికి రెండో తరగతి నుంచి మూడో తరగతికి వెళ్ళే విద్యార్థులంతా ఆయా తరగతుల అభ్యసనా సామర్థ్యాలు తప్పనిసరిగా పొందాలి.

జ్ఞాన జ్యోతి, జ్ఞాన ప్రకాష్‌గా..

ఎఫ్‌ఎల్‌ఎన్ అమలులో భాగంగా పూర్వ ప్రాథమిక విద్యను జ్ఞాన జ్యోతిగా, ప్రాథమిక విద్యను జ్ఞాన ప్రకాష్‌గా పిలుస్తున్నారు. తొలుత ప్రాథమిక విద్య బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు డీఆర్‌పీలకు శిక్షణ ఇచ్చారు. మండలానికి ముగ్గురు ఎస్‌జీటీ ఉపాధ్యాయులను డీఆర్‌పీలుగా ఎంపిక చేసి రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఇచ్చారు. జ్ఞాన జ్యోతి డీఆర్‌పీలుగా ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడానికి చర్యలు తీసుకున్నారు.

10వ తరగతి నాటికి పూర్తి సామర్థ్యం



తెలుగు, గణితం, ఇంగ్లీషు వంటి సబ్జెక్టుల్లో విద్యార్థులకు కనీస జ్ఞానం ఉండడం లేదని పలు నివేదికలు స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో విద్యార్థి ప్రాథమిక స్థాయి నుంచే అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపరుచుకునేలా చర్యలు చేపట్టడానికే ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చింది. ఈ కార్యక్రమం ద్వారా పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించడానికే లిటరసీ, న్యూమరసీ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. విద్యార్థి 3వ తరగతిలోకి వచ్చే సమయానికి తెలుగులో చదవడం, రాయడం, వినడం, మాట్లాడడం నేర్చుకోవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం అమలు జరుగుతోంది.

–రూపావత్ రంగయ్య, ఏలూరు మండల విద్యాశాఖాధికారి-2

చోరీ సొత్తు స్వాధీనం



రైళ్లలో చోరీకి పాల్పడిన నిందితుడితో రైల్వే పోలీసులు

తాడేపల్లిగూడెం: రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని పట్టుకుని అతని నుంచి రూ.5 లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అతనిని విజయవాడ రైల్వే కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని రైల్వే పోలీసులు గురువారం తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం కర్లపూడికి చెందిన జినగా జయకృష్ణ రైళ్లలో దొంగతనాలు చేసేవాడు. తాడేపల్లిగూడెం రైల్వే పోలీసుస్టేషన్ ఎస్‌ఐ, ఆర్పీఎఫ్ సిబ్బంది ఒక బృందంగా ఏర్పడి నిందితుడిని తాడేపల్లిగూడెం రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలో బుధవారం అరెస్టు చేశారు. అతని నుంచి రూ. ఐదు లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

అట్రాసిటీ కేసులు సత్వరమే పరిష్కరించాలి



ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై మాట్లాడుతున్న ఆర్డీఓ ఎస్ఎస్‌కే ఖాజావలీ

ఏలూరు(మెట్రో) : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం చేకూర్చడానికి సంబంధిత అధికారులు కృషి చేయాలని ఏలూరు ఆర్డీఓ ఎస్.ఎస్.కె.ఖాజావలి తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఏలూరు డివిజన్ విజిలెన్స్, మానిటరింగ్ (ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ) కమిటీ సమావేశం ఆర్డీఓ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమించిన కమిటీ సభ్యులు సమావేశంలో పరిచయం చేసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం గురించి ఎస్సీ, ఎస్టీలతో పాటు మిగతా ప్రజలకు కూడా అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి డివిజన్ స్థాయిలో కమిటీ సమావేశం జరుగుతుందని, మండల స్థాయిలో ప్రతి నెల సివిల్ రైట్స్‌పై కమిటీ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత సమావేశంలో కమిటీ సభ్యులు లేవనెత్తుల సమస్యల యాక్షన్ టేకెన్ రిపోర్టు వివరించారు. అట్రాసిటీ కేసుల్లో బాధితు కుటుంబాలకు భరోసా కల్పించేలా, త్వరితగతిన పరిహారం అందేలా కృషి చేయాలన్నారు. గత సంవత్సరం 22 డిసెంబరు నుంచి ఇప్పటివరకు 29 కేసులు నమోదయ్యాయని, ఈ కేసులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో ఏలూరు, నూజివీడు డీఎస్పీలు మాట్లాడుతూ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి కమిటీ సభ్యులు పోలీసు వారికి సహకరించాలని అన్నారు. సమావేశంలో డీఎస్పీలు అశోక్ కుమార్ గౌడ్, శ్రీనివాసులు, రూరల్ తహసీల్దార్ జె.శ్రీనివాస్, కమిటీ సభ్యులు ఎన్.నవనీయులకాంతం, కాకర్ల తంబి, అర్జీ అవినాష్, బి.సీతారామయ్య, కె.సతీష్ కుమార్, జి.ప్రభాకర్ రావు, కె.రవి జైన్, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ఆయుధాల ప్రదర్శన

పరేడ్ గ్రౌండ్స్‌లో విద్యార్థులకు అవగాహన



ఏలూరు పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో గన్ పనితీరును వివరిస్తున్న ఏఆర్ సిబ్బంది, చిత్రంలో ఎస్పీ మేరీ ప్రశాంతి



పోలీసు డాగ్ విన్యాసాలు

ఏలూరు టౌన్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని ఏలూరు పరేడ్ గ్రౌండ్స్‌లో పోలీస్ ఆయుధాల ప్రదర్శన(ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్) నిర్వహించారు. జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. సమాజంలో ప్రజా రక్షణకు పోలీసులు తమ విధుల్లో వినియోగించే పలు రకాల ఆయుధాలు, దుస్తులు, పరికరాలు, నేరదర్యాప్తు విధానం, పోలీస్ డాగ్స్ విన్యాసాలతో ఓపెన్ హౌస్ చేపట్టారు. బాంబు డిస్పోజల్ టీ జ ఫింగర్ ప్రింట్, పోలీస్ కంట్రోల్ రూ జ కమ్యూనికేషన్స్, నేర పరిశోధనలో కీలకంగా వ్యవహరించే పోలీస్ డాగ్ స్క్వాడ్, ఏకే 47, విల్ పిస్టల్, గ్లో 17, కార్బన్ ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత, ఫోరెన్సిక్, ఆర్ఎఫ్ఎస్ఎల్, దిశ పెట్రోలింగ్ టీమ్స్, 207 వజ్ర వాహనం, ల్యాండ్‌మైన్ ప్రూఫ్ వాహనం, ఇంటర్‌సెప్టార్ వాహనాలు, బాడీ వన్ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు ఓపెన్ హౌస్ ప్రదర్శనలో ఉంచి, వాటిపై అవగాహన కల్పించారు. పోలీస్ డాగ్ స్క్వాడ్ బృందాలు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. బాంబులు, దొంగలను, నేరగాళ్ళను ఏవిధంగా గుర్తిస్తాయనే అంశాలపై చేసిన ప్రదర్శన ఆకర్షించింది. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి పోలీస్ ఓపెన్ హౌస్‌కు హాజరైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి అంశాన్ని దగ్గరుండి మరీ విశదీకరిస్తూ పోలీస్ వ్యవస్థలో వినియోగించే అనేక రకాల ఆయుధాలు, నేర దర్యాప్తుపై చైతన్యవంతుల్ని చేశారు. ప్రజల రక్షణకు పోలీస్ వ్యవస్థ నిత్యం విశేష కృషి చేస్తుందని, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ ప్రజా సేవకు అంకితం అవుతున్నారనీ, నేరగాళ్ళను పట్టుకోవటంలో పోలీస్ కృషి అభినందనీయమన్నారు. ఈ ఓపెన్‌హౌస్‌లో ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ శేఖర్, డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, ఏఆర్ ఆర్ఐ పవన్‌కుమార్, డీసీఆర్‌బీ సీఐ ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో మృతదేహం లభ్యం



బాల సుబ్రహ్మణ్యం మృత దేహం

పెనుగొండ: దొంగరావిపాలెం పాత కొండాలమ్మ గుడి సమీపంలో గోదావరిలో లభించిన మృత దేహం ఉండ్రాజవరం మండలం చివటం గ్రామానికి చెందిన రేలంగి బాలసుబ్రహ్మణ్యం(37)గా గుర్తించారు. గురువారం ఉదయం 10 గంటల సమయంలో గోదావరిలో మృతదేహం ఉందన్న సమాచారంతో సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు వచ్చి చూసి గుర్తించారు. బాలసుబ్రహ్మణ్యం తణుకులో ప్రైవేటు ఆసుపత్రిలో కాంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 25న రాత్రి 11 గంటలకు సుబ్రహ్మణ్యం బావమరిది శివ ప్రసాద్ సోదరుడు నాగరాజుకు ఫోన్ చేసి బావ కనిపించడం లేదని సమాచారం అందించారు. చుట్టుపక్కల వెతకగా సిద్ధాంతం పాత బ్రిడ్జిపైన మోటారు సైకిల్, సెల్ ఉన్నట్లు నాగరాజుకు సమాచారం అందించాడు. బంధువులకు సమాచారం అందించడంతో మృతుడు గోదావరిలో దూకినట్లు అనుమానించి రాత్రంతా వెతికినా ఫలితం కనిపించలేదు. గురువారం ఉదయం 10 గంటలకు గోదావరిలో మృత దేహం లభ్యమైందని సమాచారంతో వెళ్లి చూడడంతో బాలసుబ్రహ్మణ్యంగా గుర్తించారు. పెనుగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

12,013 మంది రైతులకు సూక్ష్మ సేద్య పథకం



మేదినరావుపాలెంలో సూక్ష్మ సేద్య పథకంపై రైతులకు అవగాహన

దెందులూరు: ఏలూరు జిల్లాలో ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ సేద్య పథకంలో 2023-24 సంవత్సరానికి 12,013 మంది రైతులకు పథకం అమలుకు కలెక్టర్ వె.ప్రసన్నవెంకటేష్ అనుమతులు మంజూరు చేశారని పథకం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ రవి అన్నారు. గురువారం మేదినరావుపాలెంలో ఆయన మాట్లాడుతూ 12639 హెక్టార్లకు ప్రస్తుతం నమోదు చేయడం జరిగిందన్నారు. దీనికిగానూ 2,860 మంది రైతులకు 2,748 హెక్టార్లకు రైతువాటా చెల్లించారన్నారు. 2746 మంది రైతులకు 2640 హెక్టార్లకు గురువారం కలెక్టర్ పరిపాలనా ఉత్తర్వులు ఇచ్చారన్నారు. అనంతరం డ్రిప్ పైపులు రైతులకు ఇచ్చిన తరువాత ఏ విధంగా పరిశీలన చేయాలనే అంశంపై అవగాహన సదస్సును రవికుమార్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ ఉద్యోగులు రైతులు పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్య పరికరాలకు దరఖాస్తుల స్వీకరణ

తాడేపల్లిగూడెం రూరల్: జిల్లా వ్యాప్తంగా 2023-24 సంవత్సరానికి 500 హెక్టార్లలో సూక్ష్మ సేద్య పరికరాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ పి.వీరభద్రరావు తెలిపారు. తాడేపల్లిగూడెంలో గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని రకాల పండ్లు, కూరగాయలు, పూల తోటలకు రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు అందించనున్నట్టు తెలిపారు. సబ్సిడీపై సుధాకర్, నెటాఫిమ్, గ్లోబల్ కంపెనీలకు చెందిన బిందు, తుంపర సేద్య పరికరాలు అందిస్తామన్నారు. ఆసక్తి గల రైతులు తమ ఆధార్ కార్డు, భూయాజమాన్య పత్రం, బ్యాంకు ఖాతా, ఫొటో కాపీలతో రైతు భరోసా కేంద్రంలోని ఉద్యాన సహాయకులు, వీఏఏలను సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ద్వారకాతిరుమల: మండలంలోని మారంపల్లి పంచాయతీ లక్ష్మీనగర్ జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని గుణ్ణంపల్లి పంచాయతీ మహదేవపురం ఎస్సీ కాలనీకి చెందిన మనెల్లి కృష్ణ(52) లక్ష్మీనగర్‌లోని రైతు ఆలపాటి వెంకటేశ్వరరావు వద్ద పనిచేస్తున్నాడు. పొలానికి వెళ్లిన కృష్ణ పాలు తీసి, వాటిని నల్లజర్ల మండలం ఘంటావారిగూడెంలోని పాలకేంద్రంలో పోసేందుకు సైకిల్‌పై వెళుతున్నాడు. వేగంగా వెళ్తున్న పార్సిల్ కార్గో వాహనం సైకిల్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దాంతో కృష్ణ మృత దేహం నుజ్జునుజ్జయ్యింది. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పాలకోడేరు ఎంపీడీఓ సరెండర్

పాలకోడేరు: పాలకోడేరు ఎంపీడీఓ నూకల మురళీ గంగాధరరావును ప్రభుత్వం సరెండర్ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు తెలిపారు. ఇటీవల పంచాయతీ కార్యదర్శులపై పలు ఫిర్యాదులు వచ్చినప్పటికీ వాటిపై దృష్టి పెట్టలేదని పాలకోడేరులో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్ పి.ప్రశాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని ఫిర్యాదులు వచ్చినా పనితీరు మార్చుకోవడం లేదంటూ పాలకోడేరు పంచాయతీ కార్యదర్శి రమాలీలను ఇప్పటికే సరెండర్ చేసిన సంగతి తెలిసిందే.

నేత్రపర్వంగా సువర్చలా హనుమద్ కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: ఆంజనేయస్వామి జన్మనక్షత్రం పూర్వాభాద్ర నక్షత్రం పర్వదినం కావడంతో జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో గురువారం సువర్చలా హనుమద్ కల్యాణం అర్చకులు, వేద పండితులు నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని వీక్షించారు. స్వామి వారి మూలవిరాట్‌కి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పర్యవేక్షకులు కురగంటి రంగారావు పాల్గొన్నారు.

అంజన్న సేవలో ఆర్డీఓ

జంగారెడ్డిగూడెం ఆర్డీఓగా గురువారం బాధ్యతలు చేపట్టిన కె.అద్దయ్య గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రాన్ని సందర్శించారు. స్వామి వార్ని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకులు, పండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ పర్యవేక్షకుడు కురగంటి రంగారావు ఆర్డీఓకు స్వామి వారి శేష వస్త్రాన్ని కప్పి స్వామి వారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు.

తప్పిన ముప్పు



దెందులూరు: దెందులూరులో గురువారం 9వ వార్డు సెంటరులో ఉన్న విద్యుత్ స్తంభం వద్ద పారిశుద్య సిబ్బంది చెత్తను అంటించారు. అయితే మంటలు ఒక్కసారిగా విద్యుత్ స్తంభానికి వ్యాపించాయి. అదృష్టవశాత్తు విద్యుత్ వైర్లకు ప్రమాదం జరగకముందే అప్రమత్తమైన స్థానికులు, పారిశుద్య సిబ్బంది మంటలు ఆర్పేశారు. చెత్తకు మంట పెట్టే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

వీఆర్‌కు సీఐ, ఎస్సై

ఏలూరు టౌన్ : అలసత్వం కారణంగా పోలీసు ఉన్నతాధికారులు పెదవేగి సీఐ ఎస్.దుర్గాప్రసాద్, దెందులూరు ఎస్సై వీర్రాజును వీఆర్‌కు పంపారు. ఈ మేరకు ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పెదవేగి సర్కిల్ పరిధిలో ఇటీవల పెద్దఎత్తున నిర్వహించిన కోడిపందేలు దుమారం రేపాయి. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారానికి సంబంధించి ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. అనంతరం దీనికి బాధ్యులైన పెదవేగి సీఐ, దెందులూరు ఎస్సైపై క్రమశిక్షణా చర్యల్లో భాగంగా వీఆర్‌కు పంపించారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి దెందులూరు పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుళ్లు బాజీ, రమేష్‌పై చర్యలు తీసుకుంటూ వారిని బదిలీ చేసిన విషయం విధితమే. ఈ సందర్భంగా ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ విధుల్లో అలసత్వం వహించినా, అవినీతికి పాల్పడినా ఉపేక్షించబోమని హెచ్చరించారు.

ఆశాజనకంగా ఖరీఫ్

- వర్షాభావంలోనూ మంచి దిగుబడి
- తాడేపల్లిగూడెం, పెంటపాడు ప్రాంతాల్లో మాసూళ్లు ప్రారంభం



పెనుమంట్ర మండలం పొలమూరులో ఎండాకు తెగులు ఆశించిన వరి

సాక్షి, భీమవరం : వర్షాభావ పరిస్థితుల్లోను జిల్లాలో సార్వా వరి పైరు ఆశాజనకంగా ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. అక్కడక్కడా ఎండాకు, ఆకుముడత తెగుళ్లు ఆశిస్తున్నాయని వాటి నివారణకు రైతులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఇప్పుడు వర్షాలు కురవడం వల్ల పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని వివరిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని 20 మండలాల్లో ప్రస్తుత సార్వా సీజన్‌లో సుమారు 2.19 లక్షల ఎకరాల్లో వరినాట్లు వేశారు. సీజన్ ప్రారంభంలోనే వర్షాలు సక్రమంగా లేకపోవడంతో జిల్లా అంతటా వరినాట్లు వేయడంలో జాప్యం జరిగింది. తాడేపల్లిగూడెం, పెంటపాటు, గణపవరం తదితర మండలాల్లో ముందుగా వరినాట్లు వేయడంతో ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే పంట మాసూళ్లు ప్రారంభమయ్యాయి. మిగిలిన చోట్ల నాట్లు ఆలస్యం కావడంతో కొన్నిప్రాంతాల్లో పైరు ఈనిక పూర్తికాగా మరికొన్నిచోట్ల ఇప్పుడిప్పుడే ఈనిక దశ, పొట్టదశలో ఉన్నాయి. ఇలాంటి తరుణంలో నీటి ఎద్దడిలేకుండా జాగ్రత్త వహిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని అధికారుల స్పష్టం చేస్తున్నారు.

తాడేపల్లిగూడెం ప్రాంతంలో మాసూళ్ల ప్రారంభం

తాడేపల్లిగూడెం, పెంటపాటు, గణపవరం, తణుకు తదితరప్రాంతాల్లో సార్వా నాట్లు ముందుగా వేయడంతో ఆయాప్రాంతాల్లో ఇప్పటికే కొన్నిచోట్ల మాసూళ్లు పూర్తికాగా మరికొన్నిచోట్ల కోతకు సిద్ధంగా ఉంది. ముందుగా మాసూళ్లు పూర్తిచేసిన ప్రాంతాల్లో పంట ఆశాజనకంగా ఉందని ఎకరాకు 35 బస్తాలకుపైగా దిగుబడి వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. ఆకివీడు, కాళ్ల, వీరవాసరం, పాలకొల్లు, పెనుగొండ, పెనుమంట్ర తదితర ప్రాంతాల్లో ఆలస్యంగా వేసిన ఏరియాలో కొంతమేరకు పొట్ట, ఈనిక దశలో ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో సాగునీటి ఎద్దడి ఏర్పడడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేయడంతో కలెక్టర్ పి.ప్రశాంతి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

ఆందోళన చెందాల్సిన పనిలేదు



వర్షాభావ పరిస్థితుల్లో కూడా సార్వా పైరు ఆశాజనకంగానే ఉంది. ఇప్పటికే మాసూళ్లు ప్రారంభమైన తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం తదితర ప్రాంతాల్లో పంట దిగుబడులు బాగున్నాయి. ప్రస్తుతం పైరు ఈనిక, గింజలు పాలుపోసుకునే దశలో ఉన్నందున నీటి ఎద్దడి లేకుండా చూసుకుంటే మంచి దిగుబడులు వస్తాయి. అక్కడక్కడా పైరుపై కనిపిస్తున్న ఆకుముడత, ఎండాకు తెగులు నివారణకు సరైన చర్యలు తీసుకుంటే సరిపోతుంది.

– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

ఎండాకు, ఆకుముడత నివారణ చర్యలు

వర్షాభావ పరిస్థితులతోపాటు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల కొన్నిచోట్ల ఆకుముడత తెగులు, మరికొన్ని చోట్ల ఎండాకు తెగులు ఆశిస్తున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండాకు తెగులు కారణంగా పైరు ఎండుగడ్డిగా మారిపోతుందని దీనివల్ల దిగుబడి తగ్గే ప్రమాదం ఉంటుందని చెబుతున్నారు. ఎండాకు తెగులు నివారణకు కొసైడ్ 500 గ్రాముల మందుతోపాటు 10 గ్రాముల ప్లాంటోమైసిన్ మందును కలిపి ఎకరం విస్తీర్ణంలో పిచికారి చేయాలి. ఆకుముడత నివారణకు ఇండాక్స్‌కార్బ్ 100 లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ ఎస్పీ 300 గ్రాములు పిచికారి చేయాలి.

క్లుప్తంగా

మంత్రి కారుమూరికి వినతి



తణుకులో మంత్రి కారుమూరిని కలిసిన శ్రీవిశ్వ విద్య ఆధ్యాత్మిక పీఠం ప్రతినిధులు

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును శ్రీవిశ్వ విజ్ఞాన ఆధ్యాత్మిక పీఠం, పిఠాపురం ప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసిన పీఠం ప్రతినిధులు విశాఖపట్నంలో పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా నేతృత్వంలో ఆశ్రమం, ధ్యానమందిరం ఏర్పాటుకు భూమి కేటాయింపు చేయించాల్సిందిగా మంత్రి కారుమూరికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో పీఠం ప్రతినిధులు వైఎస్‌వీకేఎస్ సత్యనారాయణ, ఏఎస్ వెంకటరత్నం, పి.దుర్గాప్రసాద్, యిర్రి నాగవరప్రసాద్, వల్లూరి రామకృష్ణతోపాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఉమర్ ఆలీషా భక్తులు పాల్గొన్నారు.

చదరంగం పోటీలు



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాస్టర్స్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెస్ పోటీలు గురువారం తాడేపల్లిగూడెం పట్టణంలోని గుణ్ణం ఫంక్షన్ హాల్‌లో ఉత్సాహంగా నిర్వహించారు. వివిధ వయస్సుల వారు ఈ పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా 40 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అకాడమీ సెక్రటరీ, కోచ్ ఎస్.ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ చదరంగం పోటీలలో మొదటి మూడు స్థానాలు సాధించిన క్రీడాకారులు ఈ నెల 28, 29 తేదీల్లో భీమవరంలో నిర్వహించే ఆల్ ఇండియా ఫిడ్ రేటింగ్ టోర్నమెంట్‌కు ఎంపిక అవుతారని, విజేతల వివరాలను త్వరలో వెల్లడిస్తామని వివరించారు. సభ్యులు కృష్ణారెడ్డి, వైడీ ప్రసాద్‌లు నిర్వహణను పర్యవేక్షించారు.

బలుసులమ్మకు 25 గ్రాముల బంగారం బహూకరణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ వారికి బంగారు ఆభరణాలు నిమిత్తం పట్టణానికి చెందిన దాతలు కొట్టు నాగభూషణం, పుష్పావల్లి దంపతుల కుమార్తె లక్ష్మీ తేజస్వీ, కుమారుడు నారాయణ హనుమాన్‌లు 25 గ్రాముల బంగారం గురువారం అందజేశారు. తొలుత ఆలయం వద్ద అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కొట్టు అంజిబాబు చేతుల మీదుగా నాగభూషణం దంపతులను సత్కరించారు.

అన్నసమారాధన

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని ఆదిలక్ష్మి రాజ్యలక్ష్మి పోలేరమ్మ అమ్మవారి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రులు ముగింపు సందర్భంగా అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఈఅన్నదానాన్ని గ్రంధి రవితేజ ప్రారంభించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు, దాతల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించా మని ధర్మకర్తల మండలి చైర్మన్ ఏలూరు సాయివెంకట సత్యనారాయణ తెలిపారు. ధర్మకర్తలు సేవా సంఘం సభ్యులు రజక సంఘం సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అమ్మ ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలి

ఆకివీడు: ఆకివీడు పట్టణాభివృద్ధికి గ్రామ దేవత ఆశీస్సులు ఉంటాయని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి అన్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం పెద్దింటి అమ్మవారి ఆలయం వద్ద అన్నసమారాధనను చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణతో ప్రజల్లో ఆధ్యాత్మికత భావం పెరిగిందన్నారు. మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి మాట్లాడుతూ పెద్దింటి అమ్మ ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారన్నారు. దేవస్థానం చైర్మన్ బొమ్మారెడ్డి మాధవరెడ్డి, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మేకా పార్వతి, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ జగ్గురోతు విజయ్‌కుమార్, దేవస్థానం డైరెక్టర్లు కుంకట్ల చంద్రావతి పాల్గొన్నారు.

పోరాటాల ఫలితమే మహిళా రిజర్వేషన్ బిల్లు

ఉండి: భారత జాతీయ మహిళా సమాఖ్య పోరాటాల ఫలితంగానే మహిళా హక్కులు, చట్టాలు రూపొందించుకోవడం జరిగిందని సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని అన్నారు. గురువారం ఉండి ఏఎంసీలో జిల్లా మహాసభ నిర్వహించారు. నెక్కంటి జగదాంబ, సావారపు దేవి, యర్రంశెట్టి శాంతమణి అధ్యక్షవర్గంగా నిర్వహించిన సమావేశంలో దుర్గాభవాని మాట్లాడుతూ చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం సమాఖ్య ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. అయితే మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్రం 2029 తరువాతే దానిని అమలు చేస్తానని చెప్పడం మహిళలను మోసగించడమేనన్నారు. పంచదార్ల దుర్గాంబ, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు పాల్గొన్నారు.

సురక్షతో గ్రామీణులకు ఉన్నత వైద్యం

- తణుకు, తాడేపల్లిగూడెం డివిజన్లలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ఏర్పాటు
- పేదలకు ఉచితంగా మందుల పంపిణీ

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామీణులకు ఉన్నత వైద్యం అందించాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఊరురా ఆరోగ్య సురక్ష శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారని మండల ప్రత్యేకాధికారి దుర్గేష్ అన్నారు. గురువారం మండలంలోని రామన్నగూడెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో దుర్గేష్ మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులకు వెళితే వేలాది రూపాయలు వైద్యానికి ఖర్చవుతున్నాయన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో సామాన్య, పేదలకు ఏడు రకాల పరీక్షలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈసేవలను వినియోగించుకోవాలన్నారు. గ్రామ సర్పంచ్ చింతా వెంకట్రావు, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ మాట్లాడారు. అనంతరం 850మంది రోగులకు వైద్యులు జి.రూపాదేవి, ఏవీ.వెంకటేష్, ఆర్.స్నేహిత, ఇ.శ్వేతలు వైద్యసేవలందించారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్ కుమార్, ఆరోగ్య సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం రూరల్: రామన్నగూడెం గ్రామంలో రోగులకు వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం



తణుకు అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న సూర్య



తణుకు అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కేస్ షీట్ రాస్తున్న మునిసిపల్ ఉద్యోగులు



ఇరగవరం: ఓగిడిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా సురక్ష

ఇరగవరం: రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్ర ప్రదేశ్‌గా అభివృద్ధి చేసే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తున్నారని డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు తెలిపారు. మండలంలోని ఓగిడి గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్మెత్స సుబ్బరాజు మాట్లాడుతూ ప్రజలందరికీ ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఇంటింటికీ వెళ్లి నాణ్యమైన వైద్యం అందించడమే ఈకార్యక్రమం ముఖ్యఉద్దేశ్యమన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం పేద ప్రజలకు వైద్యపరంగా భరోసా అందిస్తుందన్నారు. ఎంతో మంది స్వల్ప ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేసి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష సేవలను అందిస్తున్నట్లు వివరించారు. ఈ శిబిరంలో 1206 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంటా సురేఖ ఎంపీటీసీ మారుమూడి భారతి, నాయకులు గంటా అప్పారావు మండల పార్టీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, ఎంపీడీవో ఎ శ్రీనివాస్, సచివాలయ, పంచాయతీ అధికారులు వైద్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదల పాలిట శ్రీరామరక్ష

తణుకు అర్బన్: పేదప్రజల ఆరోగ్య సమస్యలకు జగనన్న ఆరోగ్య సురక్ష శ్రీరామరక్ష అని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య అన్నారు. తణుకులో నంబరు 1 మునిసిపల్ పాఠశాల, బ్యాంక్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్లలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యస్థితి తెలుసుకుని ఉచిత వైద్యం అందచేస్తున్న వైనాన్ని ప్రజలంతా స్వాగతిస్తున్నారని స్పష్టం చేశారు. సచివాలయం పరిధిలో ఉన్న ప్రజానీకానికి ఇంట్లోనే సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి టోకెన్‌లు ఇవ్వడం ద్వారా వైద్య శిబిరానికి తీసుకువచ్చి ఉచితంగానే వైద్యం చేసి, మందులు ఇవ్వడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమన్నారు. చాలా మంది ప్రజానీకం ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ చిన్నపాటి సమస్యను పెద్దదిగా అయ్యే వరకు వేచి చూస్తున్నారని అన్నారు. ఏ వ్యాధి అయినా చిన్నగా ఉన్నప్పుడు చికిత్స తీసుకుంటే వెంటనే తగ్గుతుందని ముదిరిపోయాక కాస్త ఇబ్బంది పడే పరిస్థితికి తీసుకువెళ్తుందని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష నోడల్ ఆఫీసర్ డాక్టర్ బి.దుర్గామహేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు చాలా బాగా ఉపయోగపడుతుందన్నారు. ఈ క్యాంపు ఏర్పాటు చేయడం వలన చుట్టు పక్కల ప్రజలంతా తప్పనిసరిగా వచ్చి వైద్యపరీక్షలు చేయించుకుంటున్నారని అన్నారు. క్యాంపులో మునిసిపల్, సచివాలయ, వైద్యవిభాగాల సిబ్బంది ప్రజలకు అవసరమైన అన్ని సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మేనేజరు కేడబుల్యు జయకర్, గుబ్బల సూర్యచంద్రరావు, తాటిపర్తి వాసు, రేలంగి రాంబాబు, దున్నాల ఉమామహేశ్వరరావు, కొఠారు రామాంజనేయులు, జిలాని, మునిసిపల్ ఉద్యోగులు, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

మాంటిస్సోరి విద్యార్థిని ప్రతిభ



తణుకులో ఆర్చరీ క్రీడాకారిణి గాయత్రి వల్లిని అభినందిస్తున్న డైరెక్టర్ ప్రకాశరావు

తణుకు అర్బన్: ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడప జిల్లా వెంపల్లిలో నిర్వహించిన ఆర్చరీ పోటీల్లో తణుకు మాంటిస్సోరీ స్కూల్ విద్యార్థిని అత్యుత్తమ ప్రదర్శనతో వెండి పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు గురువారం తెలిపారు. ఈనెల 21 నుంచి 24 వరకు నిర్వహించిన 30వ సీనియర్ ఇండియన్ రౌండ్, 43వ సీనియర్ రికర్వ్, 19వ జూనియర్, సీనియర్ రౌండ్‌కాంపౌండ్ విభాగంలో మాంటిస్సోరీ స్కూల్ 10వ తరగతి విద్యార్థిని బి.గాయత్రి వల్లి రాష్ట్రస్థాయి సీనియర్ విభాగంలో 2వ స్థానం, జూనియర్ విభాగంలో నాల్గవ స్థానం సాధించినట్లు తెలిపారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో మరొక విద్యార్థిని ముత్యాల జాహ్నవికి ప్రశంసాపత్రం అందచేసినట్లు వివరించారు. విద్యార్థిని గాయత్రి వల్లి నవంబరు 15 నుంచి 22వ తేదీ వరకు భరత్‌పూర్ రాజస్థాన్‌లోను, 24 నుంచి 30వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు కోచింగ్ ఇచ్చిన కోచ్ హెలెన్‌ను, ప్రోత్సహించిన తల్లితండ్రులను ప్రకాశరావు అభినందించారు.

సింహగర్జనను విజయవంతం చేయాలి

పెనుగొండ: గుంటూరులో ఈ నెల 29న నిర్వహించనున్న నూర్ బాషా దూదేకుల సంఘ సింహగర్జన రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని సంఘ సభ్యులు షేక్ నాగూరు మీరా సాహెబ్, షేక్ రంజాన్‌షరీఫ్‌లో కోరారు. గురువారం పెనుగొండలో సింహగర్జన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో మస్తాన్, బబాన్, సత్తార్, షాజన్, షేక్‌సుజాయుద్దీన్‌లు పాల్గొన్నారు.

నేడు వేండ్రలో సురక్ష వైద్య శిబిరం

పాలకోడేరు: వేండ్రలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అధ్యక్షుడు భూపతిరాజు చంటిరాజు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ప్రారంభిస్తారన్నారు.

నేత్రపర్వంగా గ్రామోత్సవాలు



తణుకు సజ్జాపురంలో కనకదుర్గమ్మ తల్లి విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకువెళ్తున్న భక్తులు



వెండి రథంపై ఊరేగుతున్న వాసవీ మాతా

తాడేపల్లిగూడెం (టీఓసీ): దసరా మహోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం సాయంత్రం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా వాసవి మాత రథోత్సవం నిర్వహించారు. వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రం నుంచి పట్టణ పుర వీధుల్లో రంగు రంగుల విద్యుత్ దీపాల వెలుగులలో మిరమిట్లు గొలిపేటట్లుగా బాణాసంచా హరివిల్లులతో ఊరేగింపు జరిగింది. 8 రాష్ట్రాలకు చెందిన వివిధ కళాకారుల 300 మంది బృందం వివిధ ప్రదర్శనలు చేశారు. కేరళ, మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి వచ్చిన వివిధ కళాకారులు వివిధ అభినయాలు చూపర్లను ఆకర్షించాయి. 108 వెండి కలశాలతో వెండి రథం ముందు వాసవి మాత నామస్మరణతో మహిళలు వెండి రథం ముందు ఆకర్షణగా నిలిచారు. విజయవాడ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు మారం వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వబిలిశెట్టి నటరాజ్, కొనకళ్ళ హరినాథ్, మండవల్లి చెన్నా నాగేంద్రరావు, మండా బ్రహ్మాజీ, నున్నా సుందరం, ఆలపాటి చిన్నా, కురిసేటి శ్యాం, పేరూరి కాశయ్య, గ్రంధి సత్యనారాయణ, వాసవి క్లబ్, ఆర్యవైశ్యులు, మహిళా సభ్యులు తదితరులు పర్యవేక్షించారు.



ఊరేగింపులో శక్తి వేషాలు

నిమజ్జనానికి తరలిన కనకదుర్గమ్మ తల్లి

తణుకు అర్బన్: దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తణుకు సజ్జాపురం అండర్ గ్రౌండ్ ప్రాంతంలోని విఘ్నేశ్వర స్వామి ఆలయ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రి ముగింపు ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారిని ప్రత్యేక వాహనంపై ఉంచి భారీ ఊరేగింపుతో నిమజ్జనానికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా కనకదుర్గమ్మ తల్లికి భవానీలు, స్థానిక మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీన్‌మార్ డప్పులు, గరగ నృత్యాలు, బాణాసంచాల కాల్పులతో అమ్మవారిని సజ్జాపుర వీధుల్లో ఊరేగించి గోస్తనీ కాలువలో నిమజ్జనం చేశారు.

ఈ–క్రాప్ ముసాయిదా జాబితా ప్రచురణ

తాడేపల్లిగూడెం రూరల్: ఖరీఫ్–2023 సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్ ముసాయిదా జాబితాను అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రచురించినట్లు మండల వ్యవసాయాధికారి ఆర్‌ఎస్.ప్రసాద్ తెలిపారు. గురువారం మండలంలోని మోదుగ గుంట ఆర్‌బీకే వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడారు. సామాజిక తనిఖీ నిమిత్తం మండలంలోని 29 రైతు భరోసా కేంద్రాల వద్ద ముసాయిదా జాబితా ప్రచురించామన్నారు. సోషల్ ఆడిట్ పూర్తయిన తర్వాత గ్రామ సభ నిర్వహిస్తామని, గ్రామ సభలో ప్రతి రైతు పేరు, విస్తీర్ణం, సర్వే నెంబర్లు, ఎంత సాగు చేశారు, ఏ రకం సాగు చేశారు వంటి వివరాలను చదివి వినిపించడం జరుగుతుందన్నారు. రైతులు తమ పేర్లు ఈ–క్రాప్‌లో ఉన్నాయో లేదో సరి చూసుకోవాలన్నారు. లేకుంటే ఈ నెల 29వ తేదిలోపు వీఏఏ, వీహెచ్‌ఏ, వీఎస్‌ఏలను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్బీకే అసిస్టెంట్‌లు పి.గోవర్ధని, బి.నవీన, రైతులు కామన చంద్రరావు, సీహెచ్.వెంకటేశ్వర్లు, ఏపూరి సతీష్, మిండెల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌బీకేల వద్ద ముసాయిదా జాబితా ప్రకటిస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని హౌసింగ్ బోర్డు 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో రైల్వే ఫీడర్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 27వతేదీ శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. రైల్వేస్టేషన్ రోడ్డు, కోతిబొమ్మ సెంటర్, వెంకటరత్నం ఆసుపత్రి రోడ్డు, భూపాల్ నగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఈ తెలిపారు.

కార్గో, కొరియర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి ప్రకాష్ బాబు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆర్టీసీ ప్రయాణం ఎంత సురక్షితమో.... ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్గో సేవలకు అంతే భద్రత లభిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి కే.ప్రకాష్‌బాబు అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో కార్గో సేవల ప్రచార మాసోత్సవ కరపత్రాలను, పోస్టర్‌లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి ప్రకాష్‌బాబు మాట్లాడుతూ కార్గో సేవలను ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. పార్శిల్, కొరియర్‌లను ప్రజలకు సకాలంలో అందించేందుకు డోర్ డెలివరీ సేవలను అందుబాటులో తేవడం ఎంతో అభినందనీయమన్నారు. డిపో మేనేజర్ ఏలూరి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ నెల రోజుల పాటు డోర్ డెలివరీ సేవలపై క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ ఏడు వేల కార్గో డోర్ డెలివరీలు లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. గతంలో టార్గెట్‌కు మించి డెలివరీలు చేసినట్లు గుర్తు చేశారు. సరుకును 24 గంటల్లోనే డోర్ డెలివరీ చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కో సందర్భంలో దూరం ఆధారంగా రెండు, మూడు గంటల్లోనే డెలివరీ చేశామన్నారు. తక్కువ ధరలలో సర్వీసులు అందిస్తున్నామన్నారు. వారానికి ఒకసారి ఎల్ఆర్ నెంబరు ఆధారంగా లక్కీ డ్రా తీయనున్నట్టు వెల్లడించారు. లక్కీ డ్రాలో గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తామన్నారు. ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించుకోవాలని కోరారు. అసిస్టెంట్ మేనేజర్ సుధారాణి, ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్‌లను ఆవిష్కరించిన సీనియర్ సివిల్ జడ్జి ప్రకాష్‌బాబు, డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి

ధాన్యం కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ పీఎస్‌డీ ప్రసాద్

తణుకు టౌన్: సార్వా ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో సిబ్బంది పూర్తి అవగాహనతో మెలగాలని తహసీల్దార్ పీఎస్‌డీ ప్రసాద్ కోరారు. గురువారం తణుకు తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తణుకు మండలంలో కోనాల, ముద్దాపురం గ్రామాల్లో ముందుగా వరి కోతలు ప్రారంభమవుతాయని అందుకు అనుగుణంగా సిబ్బంది ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. గోనె సంచుల పంపిణీలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మండలంలో ధాన్యం సేకరణకు సంబంధించి సుమారు 7 లక్షల గోనె సంచులు అవసరం వున్నట్లు, ఈమేరకు అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ ఎంవీ రమేష్, ఎంపీడీవో కె కిరణ్‌కుమార్, రవాణా శాఖ, రెవిన్యూ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, సహకార శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నన్నయ యూనివర్శిటీలో మరిన్ని కోర్సులు ప్రవేశపెట్టాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): వెంకట్రామన్నగూడెంలో గేదల పరిశోధన కేంద్రాన్ని అభివృద్ధి చేసి, రైతాంగానికి ఉపయోగపడేలా చేయాలని, నిట్ యూనివర్శిటీలో రెండో దశ పనులు ప్రారంభించి అభివృద్ధి చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో గురువారం జవ్వాది శ్రీను అధ్యక్షతన సీపీఎం పట్టణ పార్టీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బి.బలరాం మాట్లాడుతూ పట్టణంలోని నన్నయ యూనివర్శిటీలో మరిన్ని కోర్సులు ప్రవేశపెట్టాలన్నారు. అరటి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అంతేగాక ప్రజలపై అనేక భారాలు ఉంచుతున్నారని, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నిత్యవసర వస్తువులు ధరలు పెరిగాయని, పెట్రోలు, డీజిల గ్యాస్ ధరలను తగ్గించాలని, అయా ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, కరెడ్ల రామకృష్ణ, శిద్దిరెడ్డి శేషుబాబు, వర్రి అప్పారావు, మడకా రాజు, ధనాల వెంకట్రావు, సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం

నీటి నమూనాలు సేకరించిన అధికారులు

సాక్షి, భీమవరం: పంట కాలువలలో కాలుష్యంపై జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు గురువారం నాడు పంట కాలువలు పరిశీలన చేసి, నీటి నమూనాల సేకరించారని న్యాయవాది, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోట గంగరాజు చెప్పారు. జిల్లాలోని అడవికోడు చానల్, ముత్యంకోడు చానల్‌లో శృంగవృక్షం, ఎగువ గ్రామాల వారు పెట్టిన మరుగుదొడ్ల, చేపల చెరువుల వ్యర్థాల పైపులు తొలగించాలని కోరుతూ జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించామన్నారు. జనవరిలో స్పందనలో కలెక్టర్ ప్రశాంతిని కలసి వినతిపత్రం ఇచ్చి, ఆరు గ్రామాల పరిధిలోని 30 వేల జనాభా, రైతులు సమస్యలను వివరించానని తెలిపారు. దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు జలవనరుల శాఖ ఈఈ దక్షిణమూర్తి నేతృత్వంలోని అధికారుల బృందం శృంగవృక్షం, నందమూరు గరువు పంచాయతీలలోను, అడవికోడు కాలువను పరిశీలించి, అనంతరం నందమూరు గరువు గ్రామ సచివాలయంలో సర్వే శాఖాధికారులు, పలువురు గ్రామ సర్పంచ్‌లు, వివిధ రాజకీయ పార్టీ నేతలతో సమావేశమై సమస్య తీవ్రతను, ప్రత్యామ్నాయ చర్యలను చర్చించారన్నారు. శృంగవృక్షం, నందమూరు గరువులో డ్రెయినేజీ నిర్మాణం నిమిత్తం అంచనాలు తయారు చేయించి, నివేదికను కలెక్టర్ అందజేసినా, ఆ సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడంతో జాతీయ హరిత ట్రిబ్యునల్ (చెన్నై)లో కేసు వేసినట్లు గంగరాజు తెలిపారు.